క్లుప్తంగా

ఆలూరు కోన రంగనాథ స్వామికి విశేష పూజలు


అలంకరణలో ఆలూరుకోన రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోనలో భక్తుల సందడి నెలకొంది. ఇక్కడ కొలువైన పురాతన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై వాగులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు


రామరాజుపల్లెలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: రామరాజుపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య సుమారు 65 మందికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ షబ్బీర్‌బాషా, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాటల కచేరీ

గుత్తి: దివంగత గాయకులు ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకల్లో భాగంగా పట్టణంలోని కెఎం ఫంక్షన్ హాల్ (ఓల్డ్ రాయల్ సినిమా థియేటర్)లో శనివారం గాన కచేరీ నిర్వహించారు. బాల సుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బాలు ఆలపించిన సినీ గేయాలను పలువురు గాయకులు మధురంగా పాడి వినిపించారు. అసోసియేషన్ సభ్యులతో పాటు కళాకారులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం ఖరారు


వేలం పాటలో పాల్గొన్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు

యల్లనూరు: మండలంలోని వేములపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12 ఎకరాల మాన్యం భూములను పంటల సాగు కోసం శనివారం వైఎస్సార్‌సీపీ సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 7ఎకరాల భూమిని పాడి సర్వేశ్వరరెడ్డి అనే రైతు రూ. 1.61 లక్షలకు దక్కించుకున్నారు. మరో 5 ఎకరాల మాన్యం భూమిని జలంధర్‌రెడ్డి రూ.35 వేలకు దక్కించుకున్నాడు. గతంలో 7 ఎకరాలు రూ.70 వేలకు, 5 ఎకరాలు రూ.32 వేలకు వేలం ఖరారైంది. ప్రస్తుతం మాన్యం భూములకు డిమాండ్ పెరగడంతో ఆదాయం రెండింతలు పెరిగింది. ఎలాంటి గొడవలు జరుగకుండా ఎస్‌ఐ గిరిబాబు పర్యవేక్షణలో వేలంపాట జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు యోగానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సూర్యకొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


లారీ బోల్తా పడిన దృశ్యం

తాడిమర్రి: ఏకపాదంపల్లి సమీపంలో శనివారం లారీ బోల్తా పడిన ఘటనలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ధర్మవరం నుంచి మట్టిలోడుతో వెళుతున్న లారీ ఏకపాదంపల్లి సమీపంలోని బస్టాప్ వద్దకు వెళ్లగానే తాడిపత్రి వైపు నుంచి ధర్మవరం వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. అయితే లారీలోని డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరక్కుండా బయట పడటంతో అక్కడ ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఏకపాదంపల్లి బస్టాప్ సమీపంలో రోడ్డుపై గుంతలు పడటం, రోడ్డు మలుపు ఉండటంతో తరచుగా లారీలు, బస్సులు, ఐచర్లు, ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత సైతం పడ్డారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గుత్తి ఎస్ఎస్ పల్లి రోడ్డులో ఇళ్ల మధ్య చేరిన వర్షపు నీరు

గుత్తిలో భారీ వర్షం

గుత్తి: నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈక్రమంలో గుత్తిలో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లు ఏరులై పారాయి. వర్షం నీటితో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. గుత్తి ఆర్ఎస్‌లోని ఎస్ఎస్ పల్లి రోడ్డు కాలనీ మడుగులా మారింది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల చుట్టూ వర్షం నీరు చేరింది. ఈదురుగాలులు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వారంలో నాలుగు పర్యాయాలు పదునయ్యే వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాల్లో సేద్యం పనులు ఊపందుకున్నాయి. ఆర్బీకేల ద్వారా రాయితీతో వేరుశనగ విత్తన కాయలు అందించడంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో గ్రామాల్లో నీటి ఇబ్బందులు తీరాయి.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పట్టణంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ తదితర వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. రోడ్ల గుంతలు వర్షపునీటితో నిండాయి. గుత్తి బీసీసీ రోడ్డు మడుగును తలపించింది. దీంతో వాహనచోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.


పామిడిలో జలమయమైన రోడ్డు

హింసకు పాల్పడితే కఠిన చర్యలు


చింతలాయపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి


ఆవులాంపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

యాడికి: చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని హింసాత్మక సంఘటనలకు పాల్పడితే సహించలేది లేదని సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కమలపాడు, చింతలాయపల్లె, బోయరెడ్డిపల్లె, చిక్కేపల్లె గ్రామాల్లో శనివారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమస్యలను సృష్టించే వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. మళ్లీ హింసాత్మక ఘటనలకు పాల్పడితే బైండోవర్ సమయంలో తహసీల్దార్ వద్ద ఇచ్చిన ష్యూరిటీ మొత్తం కట్టిస్తామన్నారు. ష్యూరిటీ డబ్బు కట్టక పోతే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.

పెద్దవడుగూరు : ఆవులాంపల్లి మలుపు వద్ద ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులను నివారించుకుందాం

గార్లదిన్నె: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ముకుందాపురంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. తొట్టిలు, కూలర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండరాదన్నారు. నీరు ఎక్కువ కాలం ఉంటే దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఫలితంగా డెంగీ, మలేరియా తదితర జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలు లార్వాలు పెరగకుండా చేయాలన్నారు. సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేసుకోవడం వల్ల దోమలను కట్టడి చేయవచ్చన్నారు. జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి మందులు తీసుకోవాలన్నారు. పీహెచ్‌ఎన్ అరుణ, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


ముకుందాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వీఆర్వో అమర్‌నాథ్‌కు నివాళి


వీఆర్వో అమర్‌నాథ్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎం వీరాంజనేయులు


నివాళులర్పిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

పామిడి: గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన పామిడి మండలం కత్రిమల వీఆర్వో వై.అమర్‌నాథ్(36)కు ప్రముఖులు నివాళులర్పించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, పామిడి డీటీ జీ లక్ష్మీనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు పామిడిలోని కమ్యూనిటీ ఆస్పత్రికి చేరుకొని అమర్‌నాథ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆర్డీఓ మాట్లాడుతూ అమర్‌నాథ్ విధి నిర్వహణలో అందించిన సేవలు మరువలేనివన్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

చురుగ్గా రోడ్డు అభివృద్ధి పనులు

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజినేయ స్వామి ఆలయ ఉత్తర గోపురం వైపు రూ. 1.10 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఉత్తర గోపురం సమీపంలో రోడ్డుకు అనుకుని ఉన్న పురాతన బావి ఎండిపోవడంతో దాన్ని పూడ్చి అక్కడ రోడ్డును నిర్మించారు. ప్రతి శనివారంతోపాటు హనుమాన్ జయంతి తదితర మంచి రోజుల్లో నెట్టికంటి ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం ఈ మార్గం గుండా నిర్వహిస్తారు. అయితే ఉత్తర గోపురం వద్ద బావి పూడ్చిన ప్రాంతంలో రోడ్డు దెబ్బతింది. దీన్ని గుర్తించిన అధికారులు రూ.1.10 లక్షలు మంజూరు చేయగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా బావిపై పెద్ద పెద్ద ఇనుప కంబీలు ఏర్పాటు చేసి దానిపై స్లాబ్ వేసి రోడ్డుకు సమానంగా చదును చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి.


బావిపై ఇనుప కంబీలు వేసి పనులు చేపట్టిన దృశ్యం

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ రాజీనామా


భూమిరెడ్డి సునీత

పుట్లూరు: శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత తన పదవికి రాజీనామా చేశారు. యార్డు చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, మాజీ ఎంపీ తలారి రంగయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. యార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. ఎనిమిది నెలలకాలంలో అధికారులు, సిబ్బంది ఇచ్చిన సహకారం ఎంతో గొప్పదన్నారు. రాజీనామా లేఖను అధికారులకు శనివారం పంపినట్లు ఆమె వివరించారు.

సింగిల్ విండో అధ్యక్షుడి రాజీనామా


అప్పేచర్ల గరుడ శేఖర్‌రెడ్డి(ఫైల్)

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు సింగిల్ విండో అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు అప్పేచర్ల గరుడ శేఖర్ రెడ్డి శనివారం తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. అప్పేచర్ల జయరామిరెడ్డి కూడా డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాలను డివిజనల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారికి పంపినట్లు తెలిపారు.

ఆంజనేయుడికి కుంభాభిషేకాలు

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని పాలికిలో వెలసిన సీతారామస్వామి సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం, సుందరకాండ యాగం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సీతారామస్వామి సమేత ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, పారాయణ హోమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ట, ప్రత్యేక హోమాలు ఏర్పాటు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడు సీతారామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం..

ఉత్సవాల్లో భాగంగా సీతారామ స్వామి ఆలయంలో ఆదివారం సీతారామ మహా పట్టాభిషేక మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరుగుతుందని సీతారామ హనుమద్ భక్త మండలి సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.


విశేష పూజలందుకున్న సీతారామస్వామి సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి

రోడ్ల పక్కనే బావులు.. ప్రమాదాలకు పిలుపులు


వాసాపురం వద్ద రోడ్డును ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

యల్లనూరు: తిమ్మంపల్లి ప్రధాన రహదారిలో వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. బావులు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఈ రోడ్డులో వాసాపురం-బుక్కాపురం మధ్య నిత్యం ఆటోలు, కార్లు, జీపులు, బస్సులు, లారీలు, ఐచర్లు తదితర వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్ల పక్కన ఉన్న బావులకు ఎలాంటి రక్షణ గోడలు లేవు. వాహనం అదుపు తప్పితే నేరుగా బావిలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. బావులు ఉన్న ప్రాంతాల్లో కనీసం ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బావులు ఉన్న ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


బుక్కాపురం వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న బావి

విద్యార్థులకు ఆధ్యాత్మికత, విజ్ఞానాన్ని బోధించాం

- సీఎస్ఐ చర్చ్ డివిజనల్ సెక్రెటరీ డేవిడ్ నాయక్


మాట్లాడుతున్న గుత్తి సీఎస్ఐ డివిజనల్ సెక్రెటరీ డేవిడ్ నాయక్


పామిడిలో విరామ బైబిల్ పాఠశాల విద్యార్థుల ర్యాలీ

గుత్తి: వెకేషనల్ బైబిల్ స్కూల్(వీబీఎస్) విద్యార్థులకు ఆధ్యాత్మికతతోపాటు జ్ఞానాన్ని బోధించామని గుత్తి సీఎస్ఐ చర్చి డివిజనల్ సెక్రెటరీ పాస్టర్ రెవరెండ్ డేవిడ్ నాయక్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న వీబీఎస్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వీబీఎస్ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డేవిడ్ నాయక్ మాట్లాడుతూ పిల్లలకు అన్ని రకాల కథలను బోధించామన్నారు. ఏసయ్య జీవిత చరిత్రను, మానవాళికి చేసిన మేలును వివరించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, సమాజంలో ఎలా నడుచుకోవాలి, పెద్దలను ఎలా గౌరవించాలనే విషయాలను బోధించామన్నారు. ఇవి పిల్లల జీవితానికి, వారి మంచి భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి చార్లెస్, కోశాధికారి ప్రసాద్ రావు, సూపరింటెండెంట్ శోభా, ఉమన్ సెల్ సెక్రెటరీ రాజామణి, వీబీఎస్ విద్యార్థులు, చర్చి సిబ్బంది , వీబీఎస్ బోధకులు పాల్గొన్నారు.

పామిడి: పామిడిలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహిస్తున్న విరామ బైబిల్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్, పాస్టరమ్మ సువర్ణమ్మ, సండేస్కూల్ టీచర్ ఎస్ ప్రిస్కిల్లా రత్నరాజు, బైబిల్ టీచర్లు ఏసుకాంత్, డేవిడ్ ప్రిన్స్ సారథ్యంలో నెహ్రూనగర్ పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యేసుక్రీస్తు జీవిత చరిత్రపై భక్తిగేయాలు ఆలపించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చర్చి సభ్యులు, సెక్రెటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, వీరయ్య, బుజ్జిబాబు, అబ్రహాం, అల్లీపీరా, యేసురత్నం, బాబావలి, స్టాన్లీ, ప్రసాద్, రజని, వాణి, భారతి, రేచెల్, మహిమ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన

రాప్తాడు: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని.. దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..


ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24, బీ–24 అని ఉంటే.. ఆ సిలిండర్ 2024 మార్చికి ఎక్స్‌పైర్డ్ అవుతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని, గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోదారుడికి ఉంది.

సిలిండర్‌కు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.



సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ (డీ-25)

వినియోగదారుడి హక్కులు

- గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి.
- గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

కనగానపల్లి: మామిళ్లపల్లి సమీపంలో కనగానపల్లి రహదారిపై బైక్ ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కనగానపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఒక యువకుడు వేగంగా వస్తున్నాడు. మామిళ్లపల్లి గ్రామానికి సమీపంలోకి రాగానే నర్సరీల వద్ద రోడ్డు పక్కన నిలిపిన మరో ద్విచక్ర వాహనంతో పాటు పక్కనే నిలబడి ఉన్న శోభా అనే మహిళను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శోభ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.